# విసి నోరు విప్పరు.. కలెక్టరూ పట్టించుకోరా!



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 19 మార్చి , 2026 | పేజీలు :08

# స్టాటిక్ ఫోర్స్‌తో పటిష్ట భద్రత





పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్

**ప్రజాపక్షం/కరీంనగర్:**రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేందరం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు స్టాటిక్ ఫోర్స్ ను (Static Force) కేటాయించామని, పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు , విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

**రంజాన్ ప్రార్థన స్థలాలను సందర్శించిన సిపి**

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించే ఈద్గాల వద్ద భద్రతా ఏర్పాట్లను కరీంనగర్ పోలీస్ కమీషనరు గౌష్ ఆలం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా సీపీ నగరం లోని సాలెహ్ నగర్ ఈద్గా , సప్తగిరి కాలనీ ఈద్గా, కరీంనగర్ వన్ టౌన్ పోలీసు స్టేషన్ ముందుగల ఈద్గాల తో పాటు పలు ప్రార్థనా స్థలాలను సీపీ సందర్శించారు. సందర్శన అనంతరం సీపీ స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు జరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈద్గాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈద్గాల వైపు వచ్చే రహదారులలో ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు, అవసరమైన చోట ముందస్తుగా రూట్ డైవర్షన్ (దారి మళ్లింపు) చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ ఏసీపీని ఆదేశించారు. స్థానిక కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా చూడాలని సూచించారు. సీపీ వెంట స్థానిక ఏసీపీలు, సీఐలు ,ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాలకులు మారుతున్నా మారని హమాలీ బతుకులు




వివరాలు మెయిన్‌లో...

## లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



వివరాలు మెయిన్‌లో...

## ధాన్యం కొనుగోలుకు పక్క ప్రణాళిక సిద్ధం

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :**నాణ్యమైన ధాన్యం కొనుగోలుకు పక్క ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతెలిపారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పౌర సరఫరాల శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ యాసంగి 2025–26 సీజన్ కు సంబంధించి దాదాపు 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 334 సెంటర్ల ద్వారా కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, కోటి 12 లక్షల 59 వేల గన్నీ సంచులు మనకు అవసరం అవుతాయని, కొనుగోలు సెంటర్ లలో మౌలిక సదుపాయాల కల్పన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2024–25 వానాకాలం సంబంధించి 100 శాతము యాసంగీ సంభందించి 93 శాతము ,2025–26 వాన కాలము సంబంధించి 28 శాతము సీఎం ఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పూర్తయిందని అన్నారు.201415 నుండి 2023–24 సంవత్సరములకు సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయి పడిన 48 రైసు మిల్లులు గుర్తించి గత పది రోజులలో 2 కోట్ల 18 లక్షల రూపాయలు డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుండి వసూలు చేయడం జరిగిందని అన్నారు.పెండింగ్ బాకాయిలు త్వరితగతిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల చెల్లించాలని, లేని యెడల డిఫాల్ట్ రైస్ మిల్లర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 5 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులో నమోదు చేసి రెవెన్యూ రికవ రీ చట్టం అమలు చేయడం జరిగిందని, మిగిలిన మిల్లులపై కూడా తనిఖీలు నిర్వహించి చట్టపరమై న చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ స మావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కే .శ్రీనాథ్,జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎ ం.శ్రీకాంత్, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

## లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి అమలు, పురోగతి పై బ్యాంకుల వారీగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలోని బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. వ్యవసాయ, విద్య, ఇతర రుణాల లక్ష్యం 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు రుణం ఇవ్వాలని ఆదేశించారు. బ్యాంక్ ల్లో వినియోగంలో లేని ప్రభుత్వ ఖాతాల వివరాలు తెలుపాలని, కేవైసీ అప్డేట్ చేయించాలని సూచించారు. ఆర్ సేథీ ఆధ్వర్యంలో ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారో ఆరా తీశారు. వివిధ శాఖలు, పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఇవ్వాలని, స్వయం ఉపాధి పొందేలా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలపై సమీక్ష చేశారు. మహిళలు తీసుకుంటున్న రుణాలతో స్వయం ఉపాధికి ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ బ్యాంక్ లలో అందించే సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, ఆర్బీఐ ఏజీఎం రాములు సబావత్, నాబార్డ్ డీడీఎం దిలీప్, యూబీఐ ఏజీఎం సురేష్ కుమార్, టీజీబీ ఆర్ ఎం రాజ నరేంద్ర, డీఆర్డీఓ గీత, డీ వీ హెచ్ ఓ రవీందర్ రెడ్డి, డీ ఏ ఓ అఫ్జల్ బేగం, ఆయా బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బొమ్మ వెంకన్న చేసిన సేవలు మరువరానివి

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:మున్నూరు కాపు ముద్దుబిడ్డ, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్ 7వ వర్ధంతి సంధర్భంగా బుధవారం బొమ్మకల్‌లోని మున్నూరుకాపు వసతి గృహంలోని ఆయన విగ్రహానికి తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ తెలంగాణలో మున్నూరు కాపులను ఒకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత బొమ్మ వెంకన్నకు దక్కుతుందన్నారు. మున్నూరు కాపులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు బొమ్మ వెంకన్న సేవలు మరువరానివన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, కుల బాంధవులు పాల్గొన్నారు.

## నవోదయలో సీటు సాధించిన ఆద్యకు అభినందనలు

ప్రజాపక్షం/శంకరపట్నం:పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని ఆల్ఫ్రెడ్ నోబెల్ పాఠశాల కరెస్పాండెంట్ గుర్రం వెంకటేశం, ప్రిన్సిపల్ ఎంసి మాథ్యూ అన్నారు. మండలంలోని ఆల్ఫ్రెడ్ నోబెల్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 5వ తరగతి చదువుతున్న పంజాల ఆద్య అత్యుత్తమ ప్రతిభతో నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొంది మంచి మార్కులు సాధించి 57వ ర్యాంకు పొంది పాఠశాలకు గర్వంగా నిలిచిందన్నారు. సదరు విద్యార్థిని ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు.ఉపాధ్యాయులు,విద్యార్థులుపాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాపక్షం/శంకరపట్నం:మండల కేంద్రం కేశవపట్నంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా కలిగి మరణించిన వ్యక్తికి రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన అంతం జాపురెడ్డి గత సంవత్సరం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. మృతుడు కేశవపట్నంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా కలిగి ఎస్‌బిఐ వారి జనరల్ ఇన్సూరెన్స్ రూ.1000 లతో ప్రమాద బీమా పొందగా క్లెయిమ్ చేసి బీమా కింద రూ.20 లక్షల చెక్కును బుధవారం గ్రామ సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ తో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ బడుగు బాలరాజు అందజేశారు. ఈ సంధర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ రూ. వెయ్యి నుంచి రూ.3 వేల వరకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్‌లు ఉన్నాయని, ప్రమాదం ఎప్పుడు ఎలా జరుగుతుందో తెలియదని, కష్టపడి కుటుంబాన్ని పోషించే ఇంటి యజమాని అనుకోని ప్రమాదానికి గురైే మరణం సంభవిస్తే కుటుంబ సంరక్షణ కోసం ప్రమాద బీమాను ప్రతి ఒక్క ఖాతాదారుడు పొందాలని కోరారు. ఎస్ఎంఓ సుబ్బారావు, డిఓఎఫ్ఐ దేవరాజ్, బ్రాంచ్ మేనేజర్ పింగళి శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది సిహెచ్ శ్యామల, వి.రేణుక, నరేందర్ తదితరులున్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

### యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏలేటి జలంధర్ రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం /రాయికల్ : రాయికల్ మండల వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రాయికల్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏలేటి జలంధర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రస్తుతం మార్కెట్‌లో మొక్కజొన్న క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ. 2,400 ఉండగా, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు బయట ప్రైవేట్ వ్యాపారులకు రూ. 1,700 నుండి రూ. 1,800 మధ్యలో అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రతి రైతు క్వింటాల్‌కు సుమారు 600 రూపాయల మేర భారీగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు.కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకుంటూ రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని, ప్రభుత్వం స్పందించి తక్షణమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం ఆలస్యం చేస్తే రైతులు మరింత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## ఇ-నామ్ 2.0 పై సాంకేతిక సమస్యలపై సమీక్ష



ప్రజాపక్షం/కరీంనగర్:వ్యవసాయ మార్కెటింగ్ లో సామర్థ్యం, పారదర్శకత, జవాబుదారితనం పెంచే ఉద్దేశంతో భారత ప్రభుత్వం చేపట్టిన ఈనామ్ 2.0 అమలు, సాంకేతిక సమస్యలు, పరిష్కారంపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ఈ నామ్ కింద 57 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఎంపిక కాగా కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఈ కమిటీల్లో ఈనామ్ 1.0 అమలు అవుతోంది. మెరుగైన ఫీచర్లు అత్యుత్తమ వర్షన్ లో 2.0 ను ప్రభుత్వం ప్రవేశపెట్టగా చొప్పదండిలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ, ఈ నామ్ 2.0 ద్వారా వ్యవసాయ మార్కెటింగ్ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడుతుందని అన్నారు. రైతులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు ఒకే డిజిటల్ వ్యవస్థలోకి వస్తారని తెలిపారు. తద్వారా మార్కెటింగ్ సామర్థ్యం, పారదర్శకత, జవాబుదారితనం మెరుగుపడతాయని తెలిపారు. 2.0 లో ఎదురైన సాంకేతిక సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి మరింత విజయవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి షాబొద్దీన్, మార్కెటింగ్ శాఖ అధికారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

## జగిత్యాల కాంగ్రెస్‌లో కీలక పరిణామం

### జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు రంగంలోకి అధిష్టానం



ప్రజాపక్షం/జగిత్యాల : కాంగ్రెస్ పార్టీకి రాజీనామా యోచనలో ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు అధిష్టానం రంగంలోకి దిగింది. దీంతో జగిత్యాల కాంగ్రెస్‌లో కీలక పరిమాణాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఆల్ ఇండియా ఓబీసీ ఇంచార్జి కత్తి వెంకట స్వామి బుధవారం జగిత్యాలలో పర్యటించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డితో 30 నిమిషాల పాటు బేటీ అయ్యారు. పార్టీలో కొనసాగాలని కోరారు. అనంతరం వెంకట స్వామి విలేకరులతో మాట్లాడారు. అదిష్టానం ఆదేశాల మేరకే జీవన్ రెడ్డి ఇంటికి వచ్చానన్నారు. 40 ఏళ్లకు పైగా రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి పార్టీని వదులుకోవడం ఎవరికి ఇష్టం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని వదులుకోదని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని ఆయనతో జరిపిన చర్చల అంశాలను అధిష్టానం దృష్టికి తీసుకవెళతానన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం దిశగా చర్యలు ఉంటాయన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కంటి పరీక్షలను వినియోగించుకోవాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ గుజ్జుల సుజాత

ప్రజాపక్షం/గొల్లపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దృష్టిలోపాలను (దూరదృష్టి సమస్య) గుర్తించి నివారించేందుకు ప్రభుత్వం ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తోందని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గుజ్జుల సుజాత తెలిపారు.బుధవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 63 మందికి విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ గుజ్జుల సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ బడులలో చదివే ,విద్యార్థులలో దృష్టి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించడానికి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రత్యేక కంటి వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి విద్యార్థులకు కంటి పరీక్షలు చేశామని ఇందులో దృష్టిలోపం ఉన్న పిల్లలకు దశలవారీగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.కంటి సమస్యలను ముందుగానే గుర్తించి అద్దాలు అందించడం ద్వారా స్పష్టంగా చూస్తూ చదువులో మెరుగైన ప్రతిభ కనబరచగలరని తెలిపారు .ఈ సదవకాశాన్ని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు . జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ రాజేందర్ రెడ్డి తో కలిసి ప్రభుత్వ బడుల్లో కంటి పరీక్షల శిబిరాలను ఏర్పాటు చేసి జిల్లాలో ఇప్పటివరకు 2500 మంది విద్యార్థులకు కంటి చూపులు ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించామని అన్నారు . గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో దృష్టిలోపం ఉన్న చిన్నారులకు కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం డి పీ ఓ రవీందర్, ఆఫ్తాల్మిక్ అధికారి తిరుపతి వైద్యాధికారి శ్రీకాంత్ , సూపర్వైజర్లు,వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మేయర్

ప్రజాపక్షం/కరీంనగర్:శ్రీ పరాభవ నామ సంవత్సరం నగర ప్రజలందరి పరాభవాలు దూరమై...విజయాలు ధరిచేరాలని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నగర మేయర్ ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్త ఊహాలకు ఊపిరిపోస్తూ, కొత్త ఆశలను చిగురింపజేస్తూ, కొత్త తెలుగు సంవత్సరం నేటితో ప్రారంభమైందని అన్నారు. కరీంనగర్ నగర ప్రజలకు, పాలకవర్గ సభ్యులకు, అధికారులకు తెలుగు నూతన సంవతర శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి... సంప్రదాయాలకు ప్రతీక అయిన ఈ ఉగాది పండగ పర్వదినాన్ని ప్రజలందరు కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. సంతోషం, సంబరం, సుఖం, సౌభాగ్యం ప్రజలందరీ తోడుగా నీడలా నడవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ నూతన పరాభవ సంవత్సరం ప్రజలందరికీ అన్నింటా కలిసిరావాలని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, ప్రగతి సంక్షేమ ఫలాలు అందాలని, తెలంగాణ రాష్ట్రం లో కరీంనగర్ నగర పాలక సంస్థ ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఆరు రుచుల ఆనంద వేదుకైన ఉగాది పండగ పర్వదినాన్ని అనురాగ ఆప్యాయతల మధ్య జరుపుకోవాలని తెలిపారు.

## పంట కాలువల పూడికతీత పనుల ప్రారంభం

ప్రజాపక్షం /పెగడపల్లి : పెగడపల్లి మండలంలోని నరసింహునిపేట గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా బుధవారం పంట కాలువల పూడికతీత పనులను గ్రామ సర్పంచ్ సంది రాజమణి మల్లారెడ్డి అధికారికంగా ప్రారంభించారు. గ్రామంలోని సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి, సాగునీరు సాఫీగా సాగేలా ఈ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని రైతులకు, కూలీలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. పంట కాలువల పూడికతీత వల్ల వర్షాకాలంలో సాగునీటి సరఫరా మెరుగుపడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనుల్లో నాణ్యత పాటించాలని మరియు కూలీలకు సరైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్ ,ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవోదయ పరీక్షలో మెరిసిన విద్యార్థిని



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కేశపూర్ గ్రామానికి చెందిన ముత్యాల మిథున నవోదయలో ప్రవేశానికి నిర్వహించిన ఆరవ తరగతి పరీక్షల్లో అర్హత సాధించి సత్తా చాటింది.మిథున అదే గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతుంది.గ్రామం నుంచి నవోదయలో సీటు సాధించిన మిథునకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పలువురు విద్యార్థిని ని అభినందించారు.

## కొడుకు మరణ వార్త విని గుండె నొప్పితో తల్లి మృతి

ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ : చేసిన అప్పును కట్టలేనని మనస్తాపంతో యువకుడు గడ్డి మందు తాగి మధ్యాహ్నం కొడుకు మరణించడంతో తట్టుకోలేక గుండె నొప్పితో సాయంత్రం తల్లి మృతి చెందిన విషాద సంఘటన జగిత్యాల మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం జగిత్యాల్ల అర్బన్ మండలం మోతే గ్రామానికి చెందిన దొడ్ల సంపత్ 25 సం కొన్ని సంవత్సరాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత కొద్ది రోజుల క్రితం వ్యవసాయ పనులు, ఇంటి నిర్మాణం గురించి అప్పుచేసి, అట్టి అప్పుని కట్టలేనని బాధపడుతూ మంగళవారం సాయంత్రం మోతే గ్రామ శివారులో గడ్డి మందు తాగగా చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించగా బుధవారం మధ్యాహ్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొడుకు దొడ్ల సంపత్ మరణించగా తట్టుకోలేని తల్లి దొడ్ల మల్లమ్మ ఒక్కసారిగా అస్వస్థత గురి కావడంతో జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తల్లి దొడ్ల మల్లమ్మ మృతి చెందింది. గ్రామానికి చెందిన తల్లి కొడుకులు ఒకే రోజు మృతి చెందడంతో మోతే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు కన్నీటిపర్యంతం అయ్యారు.

# కరాటే పోటీల్లో ఐపిఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పథకాలు సాధించారు. ఈనెల 16న కరీంనగర్ లో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు కట విభాగంలో ఏ తరుణ్, వి మనోబిరామ్, జతిన్, ధనుష్ బంగారు పథకాలు సాధించగా కట విభాగంలో మైత్ర వరుణ్, అనీష్,రిత్విక్, రజత, కాంస్యం పథకాలు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కనకేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోటో ముత్తారం 05 ఐఎంపి

# పదవ తరగతి పరీక్షకు 7480 మంది హాజరు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో పదవ తరగతి రెండ రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో పదో తరగతి సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (7489) మంది హాజరు కావాల్సి ఉండగా, (7480) మంది హాజరు కాగా,(9) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, 99.9 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని ఇట్టి పరీక్షకు సంబంధించి ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** బుధవారం రోజున పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి వద్ద గల టైల్స్ సానిటరీ షాప్ యజమాని రోడ్డుపై చెత్త వేసినందుకుగాను జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష ఆదేశాల మేరకు దుకాణ యజమానికి 10,000 రూపాయల జరిమానా వెయ్యడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపై ఇష్టానుసారంగా చిత్త వేసినట్లయితే భారీ జరిమానా విధించబడుతుందని దయ చేసి పెద్దపెల్లి పట్టణ ప్రజలు దుకాణ యజమానులు గమనించాలని మీ వద్దకు వచ్చే మా మున్సిపల్ సిబ్బందికి చెత్త అందించి స్వచ్ఛ పెద్దపల్లి కి సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్ ,వార్డ్ ఆఫీసర్ వసీం పాల్గొన్నారు.

# అందుబాటులో ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్లు: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్లు స్టాక్ సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ,ప్రజలు అనవసర ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు .జిల్లాలో గత రెండు రోజులలో సరాసరి కంటే 40% అధికంగా గ్యాస్ సిలిండర్ బుకింగ్ జరిగాయని, ప్రజలు భయాందోళనలతో గ్యాస్ సిలిండర్ బుక్ చేయవద్దని కలెక్టర్ కోరారు.3 నుంచి నాలుగు రోజుల వ్యవధిలో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సమృద్ధిగా గ్యాస్ సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని, గ్యాస్ సిలిండర్ స్టాక్ అంశాన్ని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని ప్రజలు అనవసర భయాందోళనలకు గురి కావద్దని కలెక్టర్ పేర్కొన్నారు.ఎల్.పి.జి సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేసి 29 సిలిండర్స్ సీజ్ చేయడం జరిగింది. జిల్లాలో 15 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతుందని వాటి డెలివరీలో ఏవైనా ఆటంకాలు ఎదురైతే జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నంబరు 08728 224045ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.గృహ సంబంధిత అవసరాలకు సరఫరా చేసే ఎల్.పి.జి సిలిండర్లను ప్రతి రోజు ఆర్డీఓలు, తహసీల్దార్లు, సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షిస్తున్నారని,ఎల్.పి.జి సిలిండర్ల సరఫరా పై వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని గృహ వినియోగానికి, ఆసుపత్రులకు, విద్యా సంస్థలకు, వృద్ధాశ్రమాలకు, ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సిరిసిల్లలో ఎల్‌పిజి గ్యాస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఎల్పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించేందుకు టి. సృజన, వి. వినాయక్ లు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 8008429738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని తెలిపారు.జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ఎల్పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతో పాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్నారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# రాజరాజేశ్వర ఆలయంలో ఫుడ్ సేఫ్టీ శిక్షణ



**ప్రజా పక్షం/ వేములవాడ:** శ్రీ రాజరాజేశ్వర ఆలయానికి విచ్చేసే భక్తులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, పోషకమైన ప్రసాదం,ఆహారం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం దేవస్థానంలోని ప్రసాద తయారీ విభాగం మరియు నిత్యాన్నదాన కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఆహార భద్రతా ప్రమాణాలు, పరిశుభ్రత, తయారీ విధానాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం సిబ్బందికి పరీక్ష కూడా నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న వారికి త్వరలో సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. ఇక దేవస్థానంలోని ప్రసాద తయారీ మరియు నిత్యాన్నదాన సేవలను త్వరలో ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం పరిశీలించి, “భోగ్ సర్టిఫికెట్” జారీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష బృందం నిర్వహించగా, పర్యవేక్షకులు శ్రీకాంత్ చారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## గంభీరావుపేట సీహెచ్ సీని పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీ హెచ్ సీ)లో కలెక్టర్ బుధవారం పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఏ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్ పేషెంట్ వార్డులు, మందులు ఇచ్చే గది, స్టోర్ రూమ్, వ్యాక్సినేషన్ గది, ఎక్స్ రే గది, యునాని హాస్పిటల్, ఆసుపత్రి ఆవరణ అంతా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండాలని ఎంపీడీఓకు సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మరమ్మత్తు పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా వైద్య అధికారి రజిత, డీసీ హెచ్ ఎస్ రవీందర్, సర్పంచ్ మల్లుగారి పద్మ, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, డాక్టర్ సృజన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కళ్యాణ రామచంద్రస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో బుధవారం సుమారు మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి ఆలయ కమిటీ,ఉత్సవ కమిటీ ని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి నిర్వహణ కోసం బాధ్యులుగా ఎన్నుకున్నారు.అధ్యక్షులు అనంతుల భూమయ్య, ఉపాధ్యక్షులు శాతల్ల లక్ష్మణ్, అంకం భూమయ్య, ప్రధాన కార్యదర్శి గడ్డం గంగాధర్,కార్యదర్శులు గంగాధర మధుసూదన్, ఓర్సు రవి,కోశాధికారి కాలువ శ్రీనివాస్, సహాయ కోశాధికారి అంకం సతీష్, కార్యవర్గ సభ్యులు గా కొలగాని ఉమేష్, ఆవుల వెంకటేష్,వేల్పుల రాము ఆలయ ఉత్సాహ కమిటీ ఎన్నిక ప్రధాన కమిటీతో పాటు ఆలయ ఉత్సవాలను కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఉత్సాహ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆలయ ప్రధాన సహాల దారులుగా తాడూరి సత్యనారాయణ,గురిజాల బుచ్చిరెడ్డి, కట్ట మహేష్ లతో పాటు ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా తాడూరి వంశీకృష్ణ, ఉపాధ్యక్షులుగా సంఘం కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా చెవుల మద్ది శ్రీనివాస్, కోశాధికారిగా ఐతర వేణి మధు, కార్యవర్గ సభ్యులుగా బుచ్చిరెడ్డి, శ్యాంసుందర్, రమేష్, కొమురయ్య, అనిల్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సర్పంచ్ నల్లా నీరజ సతీష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (బాయ్స్)జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని,ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్మిస్తున్న ఈత కొలను (స్విమ్మింగ్ పూల్) పనులను,వ్యవసాయ మార్కెట్ లో నిర్మిస్తున్న ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్ట్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10వ తరగతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేశామని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఐ.టి.ఐ లో నూతనంగా నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను త్వరగా పూర్తి చేసి 3 నెలలో అందుబాటులో తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో నిర్మిస్తున్న ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు కాంప్లెక్స్ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో ఏఈ నరేష్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి...

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో పది లక్షల రూపాయల విలువల గల సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్‌కుమార్ శంకుస్థాపనచేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేసి, కార్పోరేట్ స్థాయి విద్య అందేలా చర్యలు తీసుకుంటామని, పేద విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పాలకవర్గం కృషి చేస్తుందని, సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్, ఉప సర్పంచ్ జక్కుల నరేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ లెంకల లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ బోయిని రవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కోసం కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ఆదేశాల మేరకు రామగుండం3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు బుధవారం సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించరు మొత్తము 185 ఖాళీ క్వార్టర్లు ఉండగా,ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 34 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా,12 మంది ఉద్యోగులు హాజరై, 10 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు.వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటుజియం యం. రామ్మోహన్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, ఎన్.శ్రీనివాస రావు, ఇన్‌చార్జ్ పర్సనల్ విభాగాధిపతి వి.సునీల్ ప్రసాద్ ఎస్టేట్స్ అధికారి ఎస్.శ్యామల,సివిల్ విభాగం అధికారి దుర్గం శ్రీనివాస్,క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య రెడ్డి,దాసు శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన పల్లెలో వెలగని హైమాస్ట్ లైట్లు



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండ లంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అబ్రాబాద్ గిరిజన పల్లెలో హైమాస్ట్ సెంట్రల్ లైట్ నెలల తరబడి వెలగకున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.హైమాస్ట్ లైట్లు గత కొన్ని నెలలుగా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు.ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఇండ్లలోని వారికి చీకటి వల్ల వాహనదారుల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం వల్ల హైమాస్ట్ లైట్లు నిరుపయోగంగా మారుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లు వెలిగేటట్లు చూడాలని అబ్రాబాద్ (గిరిజన పల్లె) గ్రామస్తులు కోరుతున్నారు.

# గడ్డి మందు తాగి యువకుడు మృతి

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ :** చేసిన అప్పును కట్టలేనని మనస్తాపంతో యువకుడు గడ్డి మందు తాగి మరణించాడు. జగిత్యాల రూరల్ పోలీసుల ప్రకారం జగిత్యాల అర్బన్ మండలం మోతే గ్రామానికి చెందిన దొడ్ల సంపత్ 25 సం కొన్ని సంవత్సరాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తాడు. గత కొద్ది రోజుల క్రితం వ్యవసాయ పనులు, ఇంటి నిర్మాణం గురించి అప్పుచేసి, అట్టి అప్పుని కట్టలేనని బాధపడుతూ మంగళవారం సాయంత్రం మోతే గ్రామ శివారులో గడ్డి మందు తాగగా చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించగా, అట్టి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం దొడ్ల సంపత్ మరణించినాడని మృతుని తల్లి దొడ్ల మల్లమ్మ పిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# విశ్వశాంతిలో ముందస్తు ఉగాది వేడుకలు

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ పట్టణం లోని విశ్వశాంతి పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా విద్యార్థినీవిద్యార్థులు ఉగాది పచ్చడిని తయారు చేసి పాఠశాలలోని తమ మిత్రులందరికీ పంచడం జరిగింది.అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ ఉగాది తెలుగువారి తొలి పండుగ అని చైత్ర శుద్ధ పాడ్యమి నాడు సృష్టి ఆరంభమైందని నమ్మకమని అన్నారు. ఇది కొత్త సంవత్సరానికి, ఆశకు, నూతనోత్తేజానికి చిహ్నం. షడ్రుచుల సమ్మేళనం, కొత్త పనులు ఆరంభించడం, పంచాంగ శ్రవణం ఈ పండుగ విశేషాలని పేర్కొన్నారు. ఈ పండుగ రోజున పంచాంగ శ్రవణం వినడం వల్ల, వచ్చే ఏడాది కాలం ఎలా ఉండబోతుందో తెలుసుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. కాబట్టి, ఈ ఉగాది నుండి మన పాత బాధలను, చేదు జ్ఞాపకాలను మర్చిపోయి, బెల్లంలాంటి తీపి జ్ఞాపకాలతో కొత్త ప్రయాణాన్ని మొదలుపెడదాం. మరోసారి అందరికీ ఉగాది శుభాకాంక్షలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత ,విద్యాన్వేష్ ఉపాధ్యాయులు మహేష్ ,రంజిత్, వెంకటేష్ ,అప్సర్ , షారు ,రజిత, సంజన ,మంజుల ,శ్రీజ ,స్రవంతి, సౌజన్య ,నిహారిక, అనూష, మమత, సాయి హర్ష తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసిన వైస్ చైర్మన్ నవీన్



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** పట్టణంలోని మీనాక్షి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాజ్ మహమ్మద్‌కు అత్యవసరంగా A పాజిటివ్ రక్తం అవసరమవడంతో, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.తనది కూడా A పాజిటివ్ గ్రూప్ కావడంతో వెంటనే స్పందించిన ఆయన, బ్లడ్ బ్యాంక్‌లో రక్తం ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇది ఆయన చేసిన 9వ రక్తదానం కావడం విశేషం.ఈ సందర్భంగా 18 ఏళ్లు పూర్తి చేసి, కనీసం 45 కిలోల బరువు ఉన్న యువత రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నవీన్ సేవను పలువురు మున్సిపల్ పాలకమండలి సభ్యులు అభినందించారు.

# ఎన్.ఎన్.వెల్ఫేర్ సొసైటీ రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాపక్షం/కోరుట్ల :** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని స్థానిక కోరుట్ల పట్టణంలోని ఎన్.ఎన్.వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారులకు రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎన్.ఎన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు అహ్మద్ అబ్దుల్ నయీమ్, సొసైటీ అధ్యక్షులుడు అక్రమ్ మాట్లాడుతూ ప్రతి ముస్లిం తప్పనిసరిగా పాటించాల్సిన దైవిక విధి,తమ ఆస్తిలో 2.5% పేదలకు దానం చేయడం. ఇది సంపదను శుద్ధి చేయడమే కాకుండా, సమాజంలో ప్రేమ, సామాజిక బాధ్యతను పెంచుతుందని అన్నారు. రంజాన్ మాసంలో దానధర్మాలకు (జకాత్, ఫిత్రా) అత్యంత ప్రాముఖ్యత ఉంటుందని ధనవంతులు తమ సంపాదనలో కొంత భాగాన్ని,2.75 కిలోల గోధుమలు లేదా వారు తినే బియ్యం దానికి సమానమైన డబ్బును పేదలకు 'ఫిత్రా' రూపంలో అందజేస్తారని తెలిపారు.జకాత్,ఫిత్రా చెల్లించడం వల్ల స్వార్థం, లోభం, అసూయ వంటి చెడు గుణాలు తొలగిపోతాయని అన్నారు. మైనార్టీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ సిద్ధిఖి మాట్లాడుతూ నిరుపేద చిన్నారులకు సహాయం చేయడం అభినందనీయం అని తెలిపారు. కార్యక్రమానికి సహకరించి న ప్రతి ఒక్కరికి ఎన్.ఎన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త వ్యవస్థాపకులు అహ్మద్ అబ్దుల్ నయీం, ఎన్.ఎన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అక్రమ్, అమీర్, అస్లాం ,అబీద్,సనావోద్దీన్ మైనారిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ సిద్దిఖీ, ప్రధాన కార్యదర్శి మీర్జా ముక్రం బేగ్, సలావుద్దీన్, కౌన్సిలర్ సోగ్రబీ, ఇలియాస్,నయీముద్దీన్ అర్బజ్,తదితరులు పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మెట్ పల్లి డిప్యూటిరెంజర్

బి.అరుణ్ కుమార్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని మెట్ పల్లి డిప్యూటీరెంజర్ అరుణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల లోని వేములకుర్తి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం నిప్పు అడవికి ముప్పు కార్యక్రమన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులచే మానవహారం నిర్వహించి, పాఠశాల అవరణం లో అడవుల రక్షణ పై ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ రేంజర్ అరుణ్ కుమార్ మాట్లాడుతు ప్రతి ఒక్కరు అడవుల రక్షణ కోసం కృషి చేయాలన్నారు.అడవికి వెళ్లే పశువుల,గొర్రెల కాపరులు, అటవీ ఉత్పత్తులను సేకరించే వారివల్ల అడవికి నిప్పు పెట్టడం వల్ల క్రమేణా అటవీ విస్తీర్ణం తో పాటు ఏటా వర్షపాతం కూడా తగ్గిపోతోందన్నారు. అడవులకు నిప్పు పెట్టే వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటయన్నారు.వేసవి కాలంలో అడవిలో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించడంపై అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈకార్యక్రమంలో డిప్యూటీ రెంజర్ వి సురేష్ కుమార్,సెక్షన్ అదికారి సయ్యద్ ముస్తాక్ అలి,అటవీ బిట్ అదికారులు మదుసుధన్,ఎస్ ప్రదిప్, ఎ శ్రావణ్ కుమార్, ఎం ఎ రఫియె నయిం,సత్తర్,ఎం సాయిరాం ,సిబ్బంది గణేష్,ఉపాధ్యాయులు సత్యస్వామి,అనిల్ ,కోల రమేష్,విజయలక్ష్మి ,విశ్వంత్,ముత్యం విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# పులిని బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించాలి

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే

సుంకె రవి శంకర్



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండల అటవీ ప్రాంతంలో సంచిరిస్తూ ప్రజలను బయాందోళనకు గురి చేస్తున్న పెద్ద పులిని బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించేలా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ డిమాండ్ చేశారు. కోడిమ్యాల మండలం గంగారాం తండాలో సంచరిస్తున్న పులిని బందించాలని కోరుతూ బుదవారం మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజ గౌడ్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. పులి సంచారంతో భయం గుప్పిట్లో రైతులు, ప్రజలు ఉన్నారని ప్రాణాలు పోయినా అటవీ శాఖ అధికారులు పట్టించుకోరా అని మండిపడ్డారు. గత ఏడాది కాలంగా కోడిమ్యాల మండలంలతో పాటు సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి ప్రాంతాల్లో పులి సంచరిస్తూ 20పైగా పశువులను చంపి తినిందన్నారు. గత నాలుగు రోజులుగా గంగారాం తండాల్లో సంచరిస్తూ రెండు పశువుల ప్రాణాలు తీసిందని వివరించారు. పులి సంచారం సీసీ కెమారాల్లో రికార్డు అయినప్పటికి అధికారులు మాత్రం ఏలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత, కోడిమ్యాల మండల, జగిత్యాల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, ఐల్నేని వెంకటేశ్వర్ రావు, యూత్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మారెడ్డి, నాయకులు కొత్తూరి స్వామి, పవన్, నజీర్, ఆదిమల్లు, అజ్జు తదితరులు ఉన్నారు.

# అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో రైసింగ్ హైస్కూల్ ప్రతిభ



**ప్రజాపక్షం/కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని విశ్వం ఎడ్యూ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ స్టేట్ లెవెల్ ఫైనల్స్–2 పోటీలు ఘనంగా జరిగాయి.రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ పోటీల్లో రైసింగ్ హైస్కూల్ విద్యార్థులు తమ మేధస్సు, వేగం, గణిత నైపుణ్యాలతో తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాలకు గర్వకారణమయ్యారు.ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన శుభశ్రీ రెడ్డి, కమల్ నాథ్, అర్షన్ దానియల్, వేద శ్రీ, రిశ్వంత్ రెడ్డి, యూసుఫ్ అలీ, షేజాన్ ఉద్దీన్, అలీఫా,ఆనం, రుమెజా,లకు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు.పాఠశాల కరెస్పాండెంట్ కుడెల రాజేంద్రప్రసాద్,మాట్లాడుతూరాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన చిన్నారుల విజయాలు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు,గర్వకారణమనిఅన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లిఖిత ,శహనాజ్ బేగం,మోహన్,ఉపాధ్యాయులు వెన్నెల, సుమయ్య, మమత, కవిత, పాల్గొని విజేతలను అభినందించారు.

# వీర హనుమాన్ విజయ యాత్ర

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** వీర హనుమాన్ విజయ యాత్రను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలనివిశ్వహిందూ పరిషత్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఈ నెల 28న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్ర అవగాహన కరపత్రాలను జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, నగర అధ్యక్షుడు పద్మాకర్, గడ్డం వేణు గోపాల్ రెడ్డి, జిట్టవేణి అరుణ్‌లతో పాటు నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో మడేలేశ్వర ఆలయం నుండి మంచినీళ్ల బావి, టవర్, తహసీల్ చౌరస్తా మీదుగా జంబి గద్దె వరకు విజయ యాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్రలో బంధువులు పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్ కుమార్, కోశాధికారి మామిడాల రాములు, బజరంగ్ దళ్ నాయకులు విశ్వనాథ్, భూమేష్, శ్రీధర్, రాజేంద్ర ప్రసాద్, శైలజ, పద్మ, ఏసీఎస్ రాజు, ఆన్‌కార్ సుధాకర్, వేముల సంతోష్, లక్ష్మి , నాగరాజు, శ్రీనివాస్, శ్రీధర్, సాయి, బిట్టు ఉన్నారు.

# వీర హనుమాన్ విజయ యాత్ర కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల పట్టణంలోని విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28 శనివారం రోజున జరిగే వీర హనుమాన్ విజయయాత్ర కరపత్రాన్ని బుధవారం జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్,ఉపాధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ నగర అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 28 శనివారం రోజున స్థానిక మండలేశ్వర స్వామి ఆలయం నుండి మంచినీళ్ళ బావి, టవర్ సర్కిల్ తహసిల్ చేరస్తా, జంబి గద్దె వరకు వీర హనుమాన్ విజయాత్ర నిర్వహించబడుతుందని ఈ యాత్రలో హిందూ బంధువులు పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్ కుమార్, కోశాధికారి మామిడాల రాములు, బజరంగదళ్ నగర సంయోజక్ కనికరపు విశ్వనాథ్, నగర కార్యదర్శి వడ్లగట్ట భూమేష్, సత్సంగ్ ప్రముక్ అనుపురం శ్రీధర్, సేవా ప్రముక్ రాజేంద్రప్రసాద్, శైలజ,పద్మ, విశాలలక్ష్మి ,భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎసిఎస్ రాజు, హిందూ బంధువులు అందరూ పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడం అభినందనీయం

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** విశ్వ గాయత్రి పరివార్ సభ్యులు ప్రజలకు ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడం అభినందనీయమని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు. విశ్వ గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ వాణి, కౌన్సిలర్లు స్వప్న, చంద్రకళ, పద్మ, శ్రీలతలను షాలువాలతో సన్మానించారు. అనంతరం చైర్పర్సన్ వాణి మాట్లాడుతూ విశ్వ గాయత్రి పరివార్ సభ్యులు రానున్న రోజుల్లో మరిన్ని ఆద్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని, మున్సిపల్ పక్షాన అండగా నిలుస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి లక్ష్మి నారాయణ, గుండేటి రాజు తదితరులు ఉన్నారు. అలాగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీ భక్త మార్కండేయ దేవాలయం, పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాల కరపత్రాలను చైర్ పర్సన్ సమిండ్ల వాణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బోగ గంగాధర్, రాజ్ కుమార్, రాజేందర్, మహేష్, ప్రభాకర్, నరేష సందీప్, శంకర్ ఉన్నారు.

# హిందూ తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/పెగడపల్లి :** ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బుధవారం హిందూ తెలుగు క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పరాభవ నామ సంవత్సర క్యాలెండర్‌ను సమితి సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్మ రక్షణ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంలో హిందూ ధర్మ ప్రచారం మరియు భారతీయ కాలమానంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు తెలిపారు. తిథి, వార, నక్షత్రాలతో పాటు పండుగల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మ రక్షణ సమితి సభ్యులు నెల్లి మల్లేష్, కట్ల రమేష్, కాటం నరసింహారెడ్డి,మాసూరి పార్థసారథి,జడల రాజేశం,గంద్ర కిషన్ రావు, మాదారపు కిషన్ రావు,నేదరి లక్ష్మ ణ్,ఉల్లెందుల రాజశేఖర్,రాచమల్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శుభారంభానికి నాంది .. ఉగాది

## నేడు పరాభవ నామ ఉగాది పర్వదినం

### ఆలయాల్లో పంచాగ శ్రవణాలకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/జగిత్యాల :** తొలి తెలుగు పండుగను జరుపుకునేందుకు జగిత్యాల జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. మధురమైన ప్రతిక్షణం జీవితాంతం నిలువాలని కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు. ఏడాది పాటు అందరూ సుఃఖ సంతోషాలతో ఉండాలన్న ఆకాంక్షతో విశ్వావసు సంవత్సరానికి విడ్కోలు పలుకుతూ ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ ...పరాభవ నామ సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలుకడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. జీవితంలోని కష్ట సుఖాలు, చీకటి వెలుగులను ఒకేలా స్వీకరిస్తూ దృఢమైన లక్ష్యంతో ముందుకు సాగాలనే సందేశంతో షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేస్తారు. జీవన గమనంలో ఎదురయ్యే వివిధ ఉద్వేగాలు, సంతోషాలు, ఆనందాలు దుఃఖాలు, కష్టాలు, కన్నీళ్లు ఇలా ఇబ్బంది కలిగించే పరిమాణాలు చిరకాలం గుర్తుండే మధురానుభావాలు అన్నీ కలిపి ఉండే సకల రుచుల సమ్మేళనంగా ఉగాది పచ్చడిని చేసుకుంటారు. తెలుగు వారికి ముఖ్యమైన ఉగాది పండుగ రోజున కుటుంబంలోని వారంతా తలంటుకుని ఉన్న వాళ్లు కొత్త బట్టలు కట్టుకుంటే.. మధ్య తరగతి వారు శుభ్రమైన దుస్తులు కట్టుకుంటారు. వేప పువ్వు, లేత మామిడికాయ ముక్కలు, కొత్త చింత పండు పులుసు, కొత్త బెల్లం పానకంతో తయారు చేసిన ఉగాది పచ్చడిని సేవిస్తారు. పిలిచి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ పచ్చడిని అందిస్తారు.

### జిల్లా కేంద్రంలో పంచాగ శ్రవణాలు...

### ఉగాది పచ్చడిల పంపిణీ...

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గురువారం పరాభవ నామ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో పంచాగ శ్రవణాలను నిర్వహించనున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సాయి బాబా, మార్కండేయ, అష్టలక్ష్మి, అభయాంజనేయ, అయ్యప్ప, రామాలయం, విశ్వేశ్వర, సుబ్రహ్మణ్య, హరిహర తదితర ఆలయాల్లో పంచాగ శ్రవణాలను నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. అలాగే మున్నూరు కాపు, వర్తక



వ్యాపార సంఘం, మున్సిపల్ కార్యాలయం, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఉగాది బూరెలతో పాటు పచ్చడి వితరణ చేయనున్నారు. దీంతో పాటు జిల్లాలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ధర్మపురి, కొండగట్టు, కోటి లింగాల, దుబ్బరాజన్న, పొలాస పౌలస్తేశ్వర ఆలయాల్లో ఉగాది సందర్బంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

### మార్కెట్‌లో సందడి....

ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకుకునేందుకు జిల్లా ప్రజలు వివిధ సామాగ్రిని కొనుగోలు చేస్తుండడంతో జగిత్యాల టవర్ ప్రాంతం అంతా సందడిగా మారింది.

---

## గంజాయిపై అవగాహన

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని కౌఠ బి గ్రామంలో ప్రజా పలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం కౌఠ బి గ్రామంలో ఇగల్ ఫోర్స్ తెలంగాణ ప్రత్యేక బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక అధికారి డీఎస్పీ సోమనాథ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అణిచివేతనే మొదటి కవచం అని గ్రామాల్లో యువత వ్యసనాల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మనందిరిపై ఉందన్నారు.వాటికి అడ్డుకట్ట పడాలంటే ప్రజల సహకారం తోనే సాధ్యం అని అన్నారు.సిఐ గురు స్వామి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండడం తోనే భవిష్యత్‌కి బాటలు అని వ్యసన కార్యక్రమాల పట్ల తమకు సమాచారం అందించి మార్పుకి భాగస్వామ్యం అవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వామి,ఉప సర్పంచ్ రమణ రెడ్డి,ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి,యువకులు,వెండి సోమెశ్వర్, అబ్దుల్, ప్రూత్వి,గ్రామస్థులు పెద్దలు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే

## పారితోషికం వెంటనే చెల్లించాలి

**ప్రజాపక్షం/నిర్మల్ :** గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఉపాధ్యాయులకు రావాల్సిన పారితోషికాన్ని వెంటనే విడుదల చేయాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు.2024 డిసెంబర్‌లో నిర్వహించిన ఈ సర్వే పూర్తయి ఏడాది గడుస్తున్నా,నిర్మల్ జిల్లాలోని ఉపాధ్యాయులకు మాత్రం ఇంకా నిధులు అందకపోవడంపై అయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని మిగిలిన 32 జిల్లాల్లో సర్వేలో పాల్గొన్న వారికి పారితోషికం చెల్లింపులు పూర్తయ్యాయని,కేవలం నిర్మల్ జిల్లా లోనే ఇంత అలస్యం కావడంతో అంతర్యం ఏమిటని అయన ప్రశ్నించారు.ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి,పెండింగ్ లో ఉన్ననిధులను తక్షణమే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభత్వం ఇదే తీరుగా నిర్లక్ష్యం వహిస్తే,భవిష్యత్తులో జరగబోయే జనగణన విధులను బహిష్కరించే అలోచనలో ఉన్నట్లు వారు హెచ్చరించారు.

---

## సమ్మక్క హత్య నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** పెంచికలపేట మండలంలోని కొండపల్లి గ్రామంలో హత్యకు గురైన ఆదివాసి యువతి ఆత్రం సమ్మక్క కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మహిళలు, ఆదివాసీలపై దాడులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నేరాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని విమర్శించారు. ఏడు నెలల గర్భిణి అయిన సమ్మక్కను ప్రేమ పేరుతో మోసం చేసి హత్య చేసిన నిందితుడు కేర్మరి జలపతి, అతని కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిని ద్వంద్వ హత్యగా పరిగణించి కేసు నమోదు చేయాలని, కిడ్నాప్ కేసు కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. నిరుపేద ఆదివాసి కుటుంబానికి ప్రభుత్వం 25 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఐదు ఎక



రాల భూమి కేటాయించాలని కోరారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, తహసీల్దార్, కలెక్టర్, ఎస్‌పిలు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి భరోసా కల్పించాలని పేర్కొన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కూషన రాజన్న, సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నెర్పల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

---

## జిల్లా ప్రజలకు మంత్రి జూపల్లి ఉగాది శుభాకాంక్షలు..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజలకు పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'శ్రీ పరాభవ 'నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఉగాది మన వారసత్వపు పండుగ అని అభివర్ణించారు.పండుగలు,అయార వ్యవహారాలు,సంస్కృతి,సంప్రదాయాల,కళలు..జాతిని సజీవంగా నిలుపుతాయని తెలిపారు.వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు,ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని మంత్రి ఆకాంక్షించారు.సమృద్ధిగా పంటలు పండి,ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అభిలాషించారు.ప్రకృతితో మమేకమై,వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల్లో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు,ఉగాది గొప్ప పండగ అన్నారు.ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో..అది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.రైతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు.వ్యవసాయి రంగ అభివృద్ధితో అనుబంధ రంగాలు,వృత్తులు బలపడి రాష్ట్రంలో గ్రామీణ అర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు.జీవితం కష్టసుఖాల




సమ్మేళనం,ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలన్నారు.శ్రీ పరాభవ నామ సంవత్సరం ఈలో తెలంగాణతో పాటు,దేశం మరింత అభివృద్ధి సాధించాలి అని ఆకాంక్షించారు.

---

## 1వ వార్డులో తాగునీటి కష్టాలకు చెక్..

### కౌన్సిలర్ కత్తి నరేందర్ చొరవతో

### పైప్‌లైన్ మరమ్మతులు..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పట్టణంలోని 1వ వార్డు ప్రజల తాగునీటి కష్టాను తీర్చేందుకు స్థానిక కౌన్సిలర్ కత్తి నరేందర్ ప్రత్యేక చొరవ చూపారు.గత కొంతకాలంగా వార్డులోని ప్రధాన తాగునీటి పైప్‌లైన్ల లీకేజీల కారణంగా నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది.పైప్‌లైన్లు అక్కడక్కడా పగిలిపోవడంతో నీరు వృథా కావడమే కాకుండా,కుళాయిల ద్వారా వచ్చే నీటి ఒత్తిడి తగ్గి అంతంతమాత్రంగానే సరఫరా అయ్యేది.దీంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన కౌన్సిలర్,వెంటనే స్పందించి బుధవారం యుద్ధప్రతిపాదికన మరమ్మతు పనులను ప్రారంభించారు.ఏళ్ల తరబడి వేధిస్తున్న ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తమ ఇబ్బందులను అర్థం చేసుకుని సకాలంలో స్పందించిన కౌన్సిలర్ కత్తి నరేందర్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

---

## కెరమెరి వారసంత వేలం

## రూ. 3.75 లక్షలు

**ప్రజాపక్షం / కెరమెరి :** కెరమెరి మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంత వేలాన్ని బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో మొత్తం పది మంది పాల్గొనగా పెందోర్ వినేష్ 3.75 లక్షల రూపాయలకు సంతను దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈసారి వేలం పాట ఉత్సాహంగా సాగింది. నిబంధనల ప్రకారం వేలం ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి సాయిరాం, పంచాయతీ కార్యదర్శి గణేష్, కారోబార్ వెంకన్న, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు రాజ్ కుమార్, మాన్కు, శ్రీకాంత్, సాగర్ పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

### జూనియర్ సివిల్ న్యాయమూర్తి అజయ్ ఉల్లా

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** కోర్టు కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజ మార్గమని జూనియర్ సివిల్ న్యాయమూర్తి అజయ్ ఉల్లా పేర్కొన్నారు. బుధవారం సిర్పూర్ టి మండల కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో పోలీస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చిన్న చిన్న వివాదాలను కోర్టులకు తీసుకురాకుండా పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారంలో రాజీ విధానం అవలంబించడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాల

## పరిరక్షణకు వేడుకలు అవసరం

### కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో ఉగాది వంటి వేడుకలు ఎంతగానో ఉపకరిస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు, హిందీ విభాగాల నేతృత్వంలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కవి సమ్మేళనం నిర్వహించగా వారు స్వయంగా రాసిన కవితలను వినిపించారు. అనంతరం కళాశాలలో ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులు, అధ్యాపకులకు పంపిణీ చేశారు. వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మి నరసింహం, అకడమిక్ కో ఆర్డినేటర్ డి.జనార్ధన్, ఐక్యుఎసి కో ఆర్డినేటర్ ఇ.శారద, అధ్యాపకులు ఎం.రాజేశ్వర్, టి.దత్తాత్రేయ, వి.దేవేందర్, జె.మహేశ్ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### అగ్నిమాపక అధికారి శ్రీనివాస్

**ప్రజాపక్షం / జన్నారం :** వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అగ్ని ప్రమాదాలు జరగకుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ సూచించారు. జన్నారం మండలంలోని ధర్మారం గ్రామ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం అగ్నిప్రమాద నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు, ఎల్‌పిజి గ్యాస్ లీకేజీ సమయాల్లో పాటించాల్సిన సూచనలను సులభంగా అర్థమయ్యేలా తెలియజేశారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు తక్షణమే ఎలా స్పందించాలి, అగ్ని నియంత్రణ పద్ధతులు, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు సురక్షితంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు బుధవారం నిజాంసాగర్ మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడమే కాకుండా విద్యార్థినులతో ముచ్చటిస్తూ వారి విద్యాభివృద్ధి వసతులు, భవిష్యత్ అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ ఉన్నారు.

## 20న మందమర్రికి సేవ్ సింగరేణి బస్సు జాతా

### శైలేంద్ర సత్యనారాయణ

**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి సంస్థ పరిరక్షణే లక్ష్యంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో చేపట్టిన సేవ్ సింగరేణి బస్సు జాతాను విజయవంతం చేయాలని ఆ సంఘం ఏరియా కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని కెకె 5 గనిపై బుధవారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ నెల 20వ తేదీన బస్సు జాతా మందమర్రి పట్టణానికి చేరుకోనున్న నేపథ్యంలో కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సింగరేణి సంస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లు, కార్మికుల హక్కులు, ఉపాధి భద్రత కోసం ఈ జాతా ఒక కీలక ఉద్యమమని ఆయన తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కార్మిక సంక్షేమం, న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత సాధన కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఉద్యమంలో ప్రతి కార్మికుడు భాగస్వామి అయి ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు. బస్సు జాతా ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏరియా కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, వివిధ గనుల పిట్ సెక్రటరీలు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా

### చీఫ్ ఇంజనీర్ బి. అశోక్

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్ ఫార్మర్ల ప్రత్యేక నిర్వహణ ద్వారా వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలని చీఫ్ ఇంజనీర్ బి. అశోక్ ఆదేశించారు. బుధవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో తెలంగాణ ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్ మరమ్మత్తుల కేంద్రం పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లను నిర్దేశిత సమయంలోనే పునరుద్ధరించాలని సూచించారు.

## లారీ డ్రైవర్ల కనీస వేతనం 32 వేలు ఉండాలి

### ఎఐటియుసి రీజియన్ ప్రెసిడెంట్ ఉపేందర్



**ప్రజాపక్షం / బెలంపల్లి :** సింగరేణిలో బొగ్గు రవాణా చేసే లారీ డ్రైవర్లకు నెలకు కనీస వేతనం 32 వేల రూపాయలు చెల్లించాలని ఎఐటియుసి రీజియన్ ప్రెసిడెంట్ భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, లోడర్ ఆపరేటర్లకు మెరుగైన వేతనాలు ఇవ్వాలని కోరారు. క్లీనర్లకు రూ. 18 వేల వేతనం ఇస్తూ, ప్రతి నెలా 5వ తేదీ లోపు చెల్లింపులు జరపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 25 లక్షల రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్, 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కారాల కోసం 2 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించాలని, ప్రతి కార్మికునికి ఇపిఎఫ్ లేదా సిఎంపిఎఫ్ తో పాటు ఇఎస్ఐ సౌకర్యం ఉండాలని, ఏడాదికి ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేస్తూ, సింగరేణి శాశ్వత కార్మికులతో సమానంగా లాభాల్లో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న క్వార్టర్లను కార్మికులకు కేటాయించాలని, క్యాంటీన్, వర్షాకాలంలో రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

### వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత



**ప్రజాపక్షం / నస్పూర్ :** జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ, లింగ ఎంపిక నిషేధ చట్టం (పిసిపిఎన్‌డిటి) అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, స్త్రీ వైద్య నిపుణుల వద్ద ఉన్న స్కానింగ్ మిషన్ల పనితీరు, అందిస్తున్న సేవలపై సమీక్షించారు. పిండం ఆడనా, మగనా అని నిర్ధారించడం, అడగడం రెండూ నేరమేనని ఆమె స్పష్టం చేశారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలను రక్షించుకోవాలని, చదివించాలని కోరారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో పిసిపిఎన్‌డిటి చట్టం నిబంధనల పుస్తకం, మిషన్ల వివరాలు కచ్చితంగా ఉండాలన్నారు. కేంద్రాలలో ఎలాంటి ఫోటోలు ఉండరాదని, గర్భిణులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఫీజు వివరాలు, ఆసుపత్రి సర్టిఫికెట్లను గోడపై ప్రదర్శించాలని ఆదేశించారు. కొత్త స్కానింగ్ మిషన్ కొనాలన్నా లేదా పాతది తొలగించాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి ముందస్తు అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులు సహకరించాలని, మహిళా సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన లింగ నిర్ధారణ పరీక్షల అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సుధాకర్, కమిటీ సభ్యులు డాక్టర్ రాజ్ కిరణ్, రాంప్రసాద్, ఎన్‌జిఒ ప్రతినిధి వెలుగు, డాక్టర్ ప్రశాంతి, సీనియర్ అసిస్టెంట్ హారిక, లింగారెడ్డి, లక్ష్మణస్వామి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలి

### యోగా ప్రకృతి చికిత్సా నిపుణురాలు డాక్టర్ సమీరా రెడ్డి



**ప్రజాపక్షం / చెన్నూరు :** మన ఊరు, మన దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చే విధంగా విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికలు వేసుకోవాలని సత్వ ప్రకృతి చికిత్సా నిపుణురాలు డాక్టర్ సమీరా రెడ్డి ఆకాంక్షించారు. చెన్నూరు పట్టణంలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్ బై ఎమినెంట్ ఎక్స్‌పర్ట్స్, నేషనల్ మెంటరింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి అవసరమైన శారీరక ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఉల్లాసంపై అవగాహన కల్పించారు. బ్రహ్మ ముహూర్తంలో చదవడం వల్ల కలిగే లాభాలను, లక్ష్య సాధనలో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. రాత్రి ఏడున్నర గంటల లోపు భోజనం చేయడం, రోజులో జరిగిన మంచి విషయాలను గుర్తు చేసుకోవడం వంటి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. వేసవి సెలవుల్లో నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం చెన్నూరుకు గుర్తింపు తీసుకువస్తున్న డాక్టర్ సమీరా రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు సరిత, కార్యక్రమ ఇంచార్జ్ పుష్పలత, మమత, ఉపాధ్యాయులు జంపన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

## నవోదయ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం / జన్నారం :** నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో విజ్ఞాన్ సూపర్ 30 క్యాంపస్ విద్యార్థులు ఘనవిజయం సాధించినట్లు సంస్థ డైరెక్టర్ పడమటింటి రంజిత్ తెలిపారు. జన్నారం పట్టణంలో గత ఏడాది ప్రారంభించిన క్యాంపస్‌లో విద్యార్థులకు నవోదయ, సైనిక్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్లనే అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. స్థాపించిన మొదటి సంవత్సరంలోనే విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఈ విజయం లభించిందని రంజిత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన ఎల్. సహస్ర, ఎల్. షైనిక, టి. శ్రీ హర్షిని, బి. అక్షిత్ రాజ్, కె. నిహిత్‌లను డైరెక్టర్, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పడమటింటి రంజిత్, ఉపాధ్యాయులు దివ్య జ్యోతి, గంగా రెడ్డి, గంగరాజు గౌడ్ పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌లో రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలో బుధవారం పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిరుపేద ముస్లీం కుటుంబాలు పండగ ఆనందంగా జరుపుకోవాలనే లక్ష్యంతో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా డీసీసీ చైర్మెన్ ఏలే మల్లిఖార్జున్ నిరుపేద ముస్లీం సోదరులకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తైబజార్ వేలంపాట వాయిదా



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** బంజపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం వారాంతపుసంత, తైబజార్ కు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఆశించిన రేటు రాకపోవడంతో ఈ వేలంపాటను ఈనెల 24వ తేదీ మంగళవారంకు వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి భీంరావు వెళ్ళడించారు.

### ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన డిసిసి చైర్మన్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలో చివరి దశకు చేరుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కామారెడ్డి జిల్లా డీసీసీ చైర్మెన్ ఏలే మల్లికార్జున్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన వసతులు అందించాలనే తన కట్టుబాట్లను వ్యక్తం చేశారు. అనంతరం బంజారాహిల్స్ తాండాలో కీ.శే మెగావత్ హరియా కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

## క్యాన్సర్ నివారణకు కీలక అడుగు హెచ్‌పీవీ టీకా

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** హెచ్‌పీవీ టీకా క్యాన్సర్ నివారణకు కీలక అడుగు అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు బుధవారం పిట్లం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డీసీసీ చైర్మెన్ ఏలే మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఈ టీకా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ చిన్న వయస్సులోనే టీకాలు వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో పిట్లం మండల నాయకులు, స్థానిక సర్పంచులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచిత వైద్యశిబిరం

ప్రజాపక్షం/బాల్కొండ : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలోని పీహెచ్‌సీలో భారీ ఉచిత ప్రత్యేక వైద్య శిబిరాన్ని సర్పంచ్ రాంరాజుగౌడ్ బుధవారం ప్రారంభించగా జిల్లా వైద్యాధికారిని రాజశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై సేవలను పర్యవేక్షించి మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలను చేరువ చేయటమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. 314 మంది రోగులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి చికిత్సలు, మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, హమీద్, మోతిరాం, నర్సయ్య, సుమలత, వైద్య సిబ్బంది, వైద్యులు, టెక్నీషియన్లు, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాపక్షం/బోధన్: నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని సాలూరా మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఓపెన్ జిమ్ పనులను బుధవారం అధికారులు పరిశీలించారు. సాలూరా మండల ప్రజాపరిషత్ అధికారి శ్రీనివాస్ ఈ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంపీ నిధులు 4లక్షల రూపాయలతో ఈ సాలూరా మండల ప్రజల సౌకర్యార్థం ఈ ఓపెన్ జిమ్‌ను నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# పట్టణ సుందరీకరణ పనులకు స్థల పరిశీలన

ప్రజాపక్షం/భీమ్‌గల్ : నగర అభివృద్ధిలో భాగంగా జంక్షన్ ఏర్పాటు కోసం స్థలాలను బుధవారం ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించామని కమీషనర్ గోపు గంగాధర్ తెలిపారు. అంబేద్కర్ చౌరస్తా, లింబాద్రిగుట్ట కమాన్ వద్ద స్థలాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో స్వామి, నర్సయ్య, అనంత రావు, అంజుమ్ అలీ, సందీప్, నాగేంద్ర బాబు, రవి, పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రంజాన్ పండగ ఏర్పాట్లు చేశామని కమీషనర్ గోపు గంగాధర్ తెలిపారు. బాపూజీనగర్ కాలనీలోని ఈద్గా వద్ద రంజాన్ పండగ ఏర్పాట్లను ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించామన్నారు .ఈద్గా వద్ద టెంట్లు, గ్రీన్ మ్యాట్ కుర్చీలు, సౌండ్ సిస్టం తాగడానికి మంచినీరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. స్వామి, నర్సయ్య, అనంతరావు, అంజుమ్ అలీ, సందీప్, నాగేంద్రబాబు, రవి, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని వీడనున్న జీవన్‌రెడ్డి

బీజేపీలో చేరనున్నారా ?

ప్రజాపక్షం/నిజామాబాద్ : జీవన్‌రెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా . చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఏ పార్టీలో చేరుతారనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఎంపీ అరవింద్ జీవన్‌రెడ్డిని బీజేపీలో తీసుకునేలా చురుకుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పార్టీ బలోపేతం దృష్ట్యా జీవన్‌రెడ్డి చేరికపై ముందడుగు వేయాలని ఆయన భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావులతో ఎంపీ అరవింద్ సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. జీవన్ రెడ్డితో చర్చలు జరిపి పార్టీలోకి ఆహ్వానించాలనే విషయాన్ని పంచుకున్నట్లు సమాచారం.

# మా ప్రాణాలకు రక్షణ ఏదీ..?

క్యాంపస్ లో పోలీసుల దౌర్జన్యంపై వెల్లువెత్తిన ఆగ్రహం..!



ప్రజాపక్షం/బాసర : తమ ప్రాణ రక్షణ కోసం,మెరుగైన వైద్య సదుపాయాల కోసం టి.ఎస్.ఐ.ఎస్() విద్యార్థుల చేపట్టిన నిరసన ఉద్రిక్త రూపం దాల్చింది.'' మా చదువులకు భద్రత లేదు..మా ప్రాణాలకు గ్యారెంటి లేదు.'' అంటూ విద్యార్థులు క్యాంపస్ వేదికగా గళమెత్తారు.హాస్పిటల్ మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా సాగుతున్న పోరాటాన్ని అణిచివేసేందుకు యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు క్యాంపస్ చిచ్చు రేపుతున్నాయి..

## పోలీసుల తరుపై మండిపాటు..

నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు ప్రదర్శించిన వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.శాంతియుతంగా కూర్చున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం,బూతు పురాణంతో విరుచుకుపడటం బెదిరింపులకు దిగడం వంటి చర్యలు విద్యాసంస్థల పవిత్రతను దెబ్బతీస్తున్నాయని టిఎస్ఐఎస్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారుల తీరు అప్రజాస్వామికమని విద్యార్థులను భయపెట్టి ఉద్యమాన్ని అపలేరని వారు హెచ్చరించారు.

## అబద్ధపు ప్రచారాలకు చెక్...!

ఈ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని,విద్యార్థు మధ్య విభేదాలు ఉన్నాయని వస్తున్న వార్తలు పూర్తిగా కల్పితమని విద్యార్థి సంఘం స్పష్టం చేసింది.అలాగే,ఈ సమస్య పరిష్కారమైందని అధికారులు చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని,ప్రధాన డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు.ఇక వైస్ ఛాన్సలర్ రాజీనామా అంశంపై వస్తున్న వార్తలను ఖండిస్తూ..తమ పోరాటం వ్యక్తులకు వ్యతిరేకం కాదని..కేవలం వ్యవస్థలోని లోపాలను సవరించాలని,వైద్య సదుపాయాలు కల్పించాలనేదే తమ లక్ష్యమని వివరించారు.''మాది రాజకీయ పోరాటం కాదు..ఇది మా మనుగడ కోసం చేస్తున్న పోరాటం.ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ రావాలి,క్షేత్రస్థాయిలో మార్పులు మొదలవ్వాలి.అప్పటివరకు ఈ శాంతియుత సమరం ఆగదు''అని టిఎస్ఐఎస్ స్పష్టం చేసింది.అణిచివేత పెరిగే కొద్దీ ఉద్యమం మరింత బలోపేతం అవుతుందే తప్ప,బెదిరింపులకు భయపడి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని విద్యార్థులు ముక్తకంఠంతో చాటి చెప్పారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..

ప్రస్తుత సమాజంలో మహిళలదే కీలకపాత్ర..

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..




ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో మహిళల పాత్రను కొనియాడుతూ,వారికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,నేటి సమాజంలో మహిళలు అబలలు కాదని,సబలలుగా అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు.విద్య ద్వారా మాత్రమే మహిళాసాధికారత సాధ్యమవుతుందని,ప్రతి మహిళ తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వ,ప్రైవేటు రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని పేర్కొన్నా కలెక్టర్,మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహిళల అభివృద్ధికి పురుషుల సహకారం కూడా అవసరమని, సమాన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మహిళలు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్,విజయవంతమైన మహిళలు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు.జిల్లా యంత్రాంగం తరపున మహిళ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని,పని ప్రదేశాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న విద్యార్థులు,ఉద్యోగులు తమ విజయగాథలను ఈ సందర్భంగా పంచుకున్నారు.వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు,స్వయం సహాయక సంఘాల సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు.అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ అధికారి వినూత్న,డిఆర్డిఓ విజయలక్ష్మి ,ఖజానా శాఖ అధికారి సరోజ,ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి ,ఇతర శాఖల అధికారులు,కలెక్టరేట్ తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్

ప్రజాపక్షం/బైంసా : 2014వ సంవత్సరం నుండి బాసర ట్రిపుల్ ఐటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు.బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ట్రిబుల్ ఐటీ విద్యార్థి తేజస్విని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ ఘటన జరిగిందన్నారు.సరైన వైద్య సేవలు అందకపోవడం మూలంగానే ఒక నిండు ప్రాణం బలైంది అన్నారు.ట్రిపుల్ ఐటీ లో సమస్యలు రాజ్యమేలుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.గత ఆరు సంవత్సరాల క్రితం అప్పటి ఐటి మంత్రి కేటీఆర్ కొన్ని కంప్యూటర్లు మాత్రమే ఇచ్చారని,విద్యార్థులకు కంప్యూటర్లు,ల్యాప్టాప్‌లు లేకపోవడం వలన విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోతున్నారన్నారు.పేర్లు మార్చి అదే మెస్ కాంట్రాక్టర్లు సంవత్సరాల తరబడి ఉంటున్నారని,నామినేషన్ పద్ధతిని తొలగించి టెండర్లు వేయాలన్నారు.ట్రిపుల్ ఐటీ పర్యవేక్షణకు పార్లమెంటు సభ్యులు,శాసనసభ్యులు,విద్యావంతులతో కూడిన ఒక కమిటీని వెయ్యాలన్నారు.మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు.నియామకాల ప్రక్రియ పారదర్శకంగా లేదని,సమస్యలు అడిగితే పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని అధికారులు విద్యార్థులను బెదిరిస్తున్నారని అన్నారు.అక్కడ ఉన్న బేకరి యజమాని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అధిక ధరలకు అమ్మి విద్యార్థులను నిలువుగా దోచుకుంటున్నారన్నారు.ఇకనైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.

# చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన పేదింటి ఆణిముత్యం

నవోదయ ఫలితాల్లో రుత్విక్ సంచలనం...



ప్రజాపక్షం/నర్సాపూర్ జి : పట్టుదల ఉంటే పేదరికం చదువుకు ఏమాత్రం అడ్డు కాదని నర్సాపూర్ జి మండలంలోని గొల్లమడ గ్రామానికి చెందిన తుల రుత్విక్ నిరూపించాడు.ఇటీవల విడుదలైన జాతీయ స్థాయి నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రుత్విక్ ఉత్తమ ర్యాంకు సాధించి, నవోదయ పాఠశాలలో ప్రవేశానికి ఎంపికయ్యాడు.గ్రామీణ ప్రాంతంలోని ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి,జాతీయ స్థాయి పరీక్షలో మెరవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## ఆదర్శంగా నిలుస్తున్న తోబుట్టువులు..

గొల్లమడ గ్రామానికి చెందిన తుల ముత్యం,రాధ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.వీరికి ఒక కుమార్తె,ఒక కుమారుడు.వీరిద్దరు చదువులో అసాధారణ ప్రతిభ కనబరుస్తూ జిల్లాకే ఆణిముత్యాలుగా నిలిచారు.రుత్విక్ సోదరి ఇప్పటికే హైదరాబాద్‌లోని ప్రభుత్వ కార్పొరేట్ పాఠశాలలో సీటు సాధించి ప్రస్తుతం పదవ తరగతి చదువుతుండగా,ఇప్పుడు తమ్ముడు రుత్విక్ సైతం నవోదయకు ఎంపికై తన అక్క బాటలోనే పయనిస్తున్నాడు.

## గ్రామంలో వెల్లివిరిసిన సంబరాలు..

స్థానిక నవభారత్ స్కూల్‌లో చదువుతున్న రుత్విక్ సాధించిన ఈ విజయం పట్ల గ్రామస్తులు,పాఠశాల యాజమాన్యం,తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో ఉండి కూడా,తమ పిల్లలను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహిస్తున్న ముత్యం,రాధ దంపతులను పలువురు అభినందిస్తున్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరైన ప్రోత్సాహం ఉంటే జాతీయ స్థాయిలో రాణించగలరని రుత్విక్ సాధించిన ర్యాంకు మరోసారి నిరూపించింది.

# సర్జరీ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జీవన రావు



ప్రజాపక్షం/కుంటాల : తెలంగాణ రాష్ట్ర సర్జరీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నిర్మల్ జిల్లా కుంటా మండలం అంబకంటి గ్రామానికి చెందిన టి.జీవన్‌రావు ఎన్నికయ్యారు.నిజామాబాద్ పట్టణంలో వైద్య సేవలు అందిస్తున్న జీవన్ రావుకు సీనియర్ వైద్యునిగా,పేదల డాక్టర్‌గా పేరుంది.ఈ సందర్భంగా జీవన్‌రావు డాక్టర్‌ను బి.జె.పి జిల్లా నాయకులు జి.వి.రమణ రావు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు అభినందించారు.

# నవోదయ పరీక్షలో జిల్లాస్థాయిలో ఘనత చాటిన వేదం విద్యార్థి

ప్రజాపక్షం/బోథ్ : మండల కేంద్రంలో స్థానిక వేదం పాఠశాల విద్యార్థి అయిన కౌట బి గ్రామానికి చెందిన వెండి సతీష్ కుమారుడు వెండి శివ సాయి జిల్లాస్థాయిలో 16వ ర్యాంకు సాధించి ఘనత చాటాడు.ఇంతే కాకుండా సైనిక్ స్కూల్లో కూడా జాతీయ స్థాయిలో 16 వేల ర్యాంకును కూడా సాధించాడు.జాతీయ స్థాయిలో,జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించడంతో విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ శాలువాతో సత్కరించి అభినందించారు

# సైబర్ క్రైమ్ ముందు బోధన్ నిందితులు

ప్రజాపక్షం/బోధన్: సైబర్ నేరాలపై ప్రత్యేక ఆపరేషన్ వల్ల సైబర్ క్రైమ్‌కు పాల్పడిన బోధన్ నిందితులు ఐదుగురు అరెస్టు అయినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మొహమ్మద్ అజర్(28) రెంజల్ బేస్,బోధన్, శ్యామల నవీన్(30) డెయిరీ ఫార్మ్, ఏకచక్ర నగర్, బోధన్, ఖాసీం పటేల్(25), ఉద్మీర్ గల్లీ, బోధన్, మొహమ్మద్ మినాజ్ అహ్మద్(35) ఫ్రూట్ వ్యాపారం, రెంజల్ బేస్, బోధన్, సయ్యద్ హాఫీజ్(32) డీలక్స్ మొబైల్ షాప్, షర్బతి కాలువ బోధన్ లు సైబర్ క్రైమ్ కేసులో అరెస్టు కాగా, వారిని న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు పంపించామని సిఐ తెలిపారు.

# ఘనంగా ఉగాది వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్‌:** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంప్రదాయ వస్త్రధారణలో ఆసుపత్రి సిబ్బంది కార్యక్రమానికి హాజరై పండుగ వాతావరణాన్ని ప్రతిబింబింపచేశారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వయంగా తయారు చేసిన షడ్రుచుల ఉగాది పచ్చడితో పాటు పలురకాల పిండి వంటలను అందరికీ పంపిణీ చేశారు. జీవితంలోని సుఖదుఃఖాలకు ప్రతీకగా నిలిచే ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను వివరించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో అందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. ఉగాది పండుగ తెలుగు ప్రజల ఆత్మీయత, ఐక్యతకు ప్రతీక అన్నారు. కొత్త ఆరంభాలకు నాంది పలికే పర్వదినమని పేర్కొన్నారు. ఉగాదిన పంచాంగ శ్రవణం చేయడం, కొత్త సంకల్పాలు చేసుకోవడం, పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం వంటి సాంప్రదాయాలు తెలుగు సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ పండుగ ద్వారా మన సంస్కృతి, విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, హెచ్‌ఆర్ ఈశ్వర్, ఆపరేషన్ మేనేజర్ సాయి చరణ్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య తదితరులున్నారు.

**హుజూరాబాద్ :** హుజూరాబాద్ పట్టణంలోని ఎస్‌బిఐ లైఫ్ కార్యాలయంలో బుధవారం ముందస్తు ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌బిఐ లైఫ్ హుజూరాబాద్ డిఎస్‌ఎం కొత్తపల్లి పైడయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడిని, భక్ష్యాలను యూనిట్ మేనేజర్లకు లైఫ్ మిత్రులకు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమంగా విధులు నిర్వహించిన వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం డిఎస్‌ఎం పాడే మాట్లాడుతూ ఎస్‌బిఐ లైఫ్ సంస్థ ప్రారంభమై ఈ ఏడాదికి 25 సంవత్సరాలు నిండుతుందని దేశ వ్యాప్తంగా ఉన్న కస్టమర్లకు మెరుగైన సౌకర్యాలను అందిస్తుందని అన్నారు. లబ్ధిదారులకు పాలసీ ఫలితాలు అందించడంలో ఇతర సంస్థల కన్నా ముందుందని అన్నారు. ప్రజల మద్దతుతో ఎస్‌బిఐ లైఫ్ మరింత ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ లైఫ్ ట్రైనర్ కృష్ణవేణి, ఉద్యోగులు నాగరాజు, మహేందర్, పరుశురాం దుర్గా శ్రీ మహాలక్ష్మి, రాజేష్, యూనిట్ మేనేజర్లు రమణాచారి, విష్ణు, సాయికిరణ్, నాగేశ్వర్, రమేష్ బాబు, రాజేష్, సురేష్, మల్లయ్య, సంపత్ కుమార్, రమణారెడ్డి పాల్గొన్నారు.

**కరీంనగర్‌టౌన్‌:** కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలలో బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉగాది పండుగ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఉగాది పచ్చడిని తయారు చేసి పంపిణీ చేశారు. విద్యార్థులు ఉగాది పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా విద్యాసంస్థ ఆవరణను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు.

**పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్‌లోని యూనివర్సల్ ఐఐటి, నీట్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు ఉగాది వేడుకలను జరిపారు. విద్యార్థులు నస్త్రీస్ట్రీ పరాభవనామ సంవత్సరానికి స్వాగతం పలికారు. ఉగాది పచ్చడి, భక్ష్యాలు తయారు చేసి అందరికి పంచారు. ఉగాది పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అష్ఫల్‌లు వివరించారు. విద్యార్థులందరూ సంప్రదాయ దుస్తులతో వేడుకల్లో పాల్గొనడంతో సంతోషకర వాతావరణం నెలకొంది.



**పెద్దపల్లి టౌన్ :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది పండుగ యొక్క ప్రాముఖ్యత, విశిష్టతను అధ్యాపకులు వివరించారు. "ఉగాది" అనగా నూతన సంవత్సరానికి ఆరంభమని, ప్రకృతి మరియు కాలచక్రంలో చోటుచేసుకునే మార్పులను అనుసరించి ఈ పండుగను జరుపుకుంటామని పిల్లలకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలియజేశారు.ఉగాది పండుగలో ముఖ్యమైన ఉగాది పచ్చడి యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, దానిలోని పదార్థాలు జీవితం లోని ఆనందం, దుఃఖం, కోపం,



ఆశ్చర్యం వంటి అనుభవాలకు ప్రతీకలని చెప్పారు. అనంతరం విద్యార్థుల చేతనే ఉగాది పచ్చడిని తయారు చేయించి, అందరికీ పంపిణీ చేశారు.ఇంకా, ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ఉగాది పాటలు, భక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను అలరించారు. చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యానికేతన్ చైర్మన్ శ్రీనివాస్ , కరస్పాండెంట్ రజిని మరియు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

**ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని జిల్లెల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ గద్దం రాజేశం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు ఉగాది పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గద్దం రాజేశం ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది పండుగ ప్రాముఖ్యతను వివరించి, సంప్రదాయాల పరిరక్షణ అవసరాన్ని తెలిపారు.అలాగే ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను వివరించి, అందరికీ పంచడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** ముందస్తుగా శ్రీపరాభవనామ సంవత్సర ఉగాది కొత్తసంవత్సరం సందర్భంగా ఎల్లారెడ్డిపేట జిల్లాపరిషత్ హైస్కూల్‌లో వేడుకలు బుధవారం జరిపారు.ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు గరుగుల స్వామి అధ్యక్షతన ఉగాది వేడుకలు జరిపామని అన్నారు.తెలుగు ఉపాధ్యాయులుఅజ్మీర బిక్కునాయక్,నర్రఅంజనేరెడ్డి,న్యాతరమేష్,విద్యార్థులకు,పిల్లలకు తెలుగుసంవత్సరాల,నెలల పేర్ల పద్యపఠనం, తెలుగులో భాషణం,ఇతర అంశాలపై పోటీలు నిర్వహించారు.నిర్వాహకులు ముత్యాలశ్రీనివాస్‌రెడ్డి, ఎలుగందుల శంకర్,సాధుశైలజ,చిట్టిశ్రీకాంత్,దరిపల్లి శ్రీనివాస్,తుమ్మలమధుసూదన్,నునావత్‌రాజు.స్తంభంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా పిల్లలు సంప్రదాయ దుస్తులలో ఉగాది పచ్చడి తయరుచేసి ముందస్తు పండుగ షడ్రుచులతో జరుపుకున్నారు.

**వీర్నపల్లి:** మండల కేంద్రంలోని పీఎం ఎంపీఎస్ వీర్నపల్లి, అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలతో తరగతి గదులను అలంకరించి, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఉగాది పచ్చడిని తయారు చేసి విద్యార్థులకు అందించి, పండుగ ప్రాముఖ్యతను వారికి వివరించారు. ప్రధానోపాధ్యాయులు రజిత, శిరీష, ఉపాధ్యాయులు ప్రవీణ, మౌనిక స్వర్ణలం పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో సెలెస్టియల్ హై స్కూల్లో కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సరంను పురస్కరించుకుని ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, సమిష్టిగా బ్రహ్మదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీపి, కారం, చేదు, ఉప్పు, వగరు, పులుపు అనే షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన ఉగాది పచ్చడి, భక్షాలు, పులిహోరలను నైవేద్యంగా సమర్పించారు. అలాగే పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, "యుగాది అంటే యుగానికి ఆది, అంటే ఒక కొత్త యుగం ప్రారంభమని అర్థం అన్నారు. ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసైన్ భూములు అన్యాయంగా ఇతరుల చేతుల్లోకి

### డిహెచ్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** రాష్ట్రంలో వేలాది ఎకరాల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, అసైన్ భూములు అన్యాయంగా ఇతరుల చేతుల్లోకి వెళ్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) రాజన్న సిరిసిల్ల జిల్లా రెండ వ మహాసభల కు గుండ్రపల్లి రవీంద్ర అధ్యక్షతన సమావేశం గ్రామిక భవన్ లో బుధవారం సమావేశం జరిగింది. మహాసభల ప్రారంభ సూచికగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మ ణ జెండా ఆవిష్కరించారు. జిల్లా మహాసభలను ప్రారంభిస్తూ డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దళితులు మరియు భూమిలేని పేదల భూహక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు భూకమిటీ ఇచ్చిన సిఫారసులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూకమిటీ స్పష్టంగా సూచించినట్లుగా భూముల రక్షణకు కఠిన చర్యలు తీసుకోవడం, భూమిలేని దళిత కుటుంబాలకు సాగు భూమి పంపిణీ చేయడం అత్యవసరం అని పేర్కొన్నారు. అసైన్ భూముల ఆక్రమణలను




వెంటనే తొలగించా లి భూమిలేని దళితులకు సాగు భూమి కేటాయించాలి. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ, ఆ నిధులు నిజంగా దళితులు, ఆదివాసుల అభివృద్ధికే ఖర్చవుతున్నాయా లేదా అన్న విషయంపై స్పష్టత లేకపోవడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు.

## పంచరెడ్డి సురేష్ మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది

### భౌతికకాయానికి నివాళులర్పించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బీజేపీ నాయకుడు, మాజీ కార్పోరేటర్ పంచరెడ్డి సురేష్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లోని ఎమ్మెల్యే బుధవారం హుటాహుటిన జిల్లా కేంద్రానికి ఇందూరుకు చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి మాట్లాడారు. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న నాయకుడు సురేష్ అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఇటీవల జరిగిన కార్పోరేటర్ ఎన్నికల్లో ఆయన సతీమణి పంచరెడ్డి అనిత భారీ మెజార్టీతో విజయం సాధించడం వెనక సురేష్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అందరిని కలుపుకొనిపోయే మనస్తత్వమున్న నాయకుడన్నారు. కార్పోరేటర్‌గా ప్రజాసేవ చేస్తూ డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాడని కొనియాడారు. మృదుస్వభావిగా పేరు తెచ్చుకున్న ఆయన గుండెపోటుకు గురి కావటం తీవ్రంగా కలిచివేసిందన్నారు. బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు.

## మునిసిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా చేసిన వారిపై కేసులు

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఏజేన్సీల ఏర్పాటును వ్యతిరేకిస్తూ మంగళవారం నిజామాబాద్ మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన వర్కర్స్ యూనియన్ జేవిసి నాయకులపై, మునిసిపల్ కార్మికులపై వివిధ సెక్షన్లు చూపుతూ 20 మంది నాయకులు, కార్మికులపై నాలుగో టౌన్‌లో కేసులు పెట్టడం జరిగిందని ఎన్ఐ తెలిపారు. కేసులు నమోదుచేసిన వారిలో సిఐటియు రమేష్ బాబు, ఏఐటియుసి ఓమయ్య, సిటియుసి సుధాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్‌లపై, 15 మంది మునిసిపల్ కార్మికులపై పోలీసుల విధులకు ఆటంకం కల్పించారన్న కారణం, కార్మికులు విధులకు హాజరు కాకుండా అడ్డుకోవడం, పోలీసులపై దాడి, అక్రమంగా మునిసిపల్ కార్యాలయంలోకి ప్రవేశించడం, కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం, అధికారులను భయభ్రాంతులకు గురిచేయడం తదితర కారణాలు చూపిస్తూ సంబందిత నాయకులపై కేసులు నమోదు చేయడం జరిగిందని, వీటి ఆధారంగా వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచాలని తెలిపారు.

## పూర్తయిన శ్రీరుద్ర సహిత మహాచండీయాగం

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ నగరంలోని నాలుగో డివిజన్ దుర్శేడ్ లో గల శ్రీమరకత లింగ రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజులుగా శ్రీ విశ్వంభరీ పీఠం భాగ్యనగరం ఆధ్వర్యంలో ఆలయంలో శ్రీరుద్ర సహిత మహా నవ చండీయాగం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం శ్రీమహాగణాధిపతి పూజతో ప్రారంభించి ఆవాహిత మంటప పూజలు శ్రీరుద్ర సహిత మహానవచండీ సప్తశతి యాగం, సువాసిని పూజ, కుమారీ పూజలు, మహా పూర్ణాహుతి తో చండీ యాగం పూర్తయినట్లు రుత్విక్కులు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రుత్విక్ సన్మానం, తీర్థ ప్రసాద వితరణ, అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ నందాల తిరుపతి, 4వ డివిజన్ కార్పోరేటర్ భూపతి రవీందర్, మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, రామచంద్రం , ఆలయ అర్చకులు దేవరాజు ప్రశాంత్ శర్మ, వర్గల్ దేవాలయ ప్రధాన అర్చకులు దేవరాజు ప్రవీణ్ శర్మ, దేవాలయ కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి యాగం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.